
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.21 (ఆది)
సహరి : 4.48 (సోమ)



సీఎం చంద్రబాబు జనంతో మమేకమయ్యారు. ఎటువంటి హంగూ ఆర్బాటం లేకుండా తణుకు పర్యటన కొనసాగించారు. పారిశుధ్యంపై ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. పట్టణాలు, పల్లెలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులను అక్కున చేర్చుకున్నారు. ప్రజల సమస్యలను నేరుగా ఆలకించి వాటికి పరిష్కారం చెప్పారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా కల్పించారు. టార్గెట్ 2029 ఎన్నికలకు వెళ్లే దిశగా ఏం చేయాలో రూట్‌మ్యాప్ ఇచ్చారు. మొత్తంగా సీఎం తణుకు పర్యటన జనంలో జోష్‌ను నింపగా, పార్టీ కేడర్‌లో ఉత్సాహం ఉరకలేసింది.



స్వచ్ఛాంధ్ర సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



సచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం చంద్రబాబు.. వేదికపై మంత్రులు నిమ్మల, నారాయణ, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి, బొలిశెట్టి, కలెక్టర్ నాగరాణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, అధికారులు, పారిశుధ్య కార్మికులు

జనంతో మమేకం..

హంగూ ఆర్భాటాలు లేకుండా సీఎం చంద్రబాబు పర్యటన



ఐక్యనగర్ పార్క్‌ను పరిశీలిస్తున్న సీఎం

కార్యకర్తలకు కర్తవ్యబోధ

తణుకు నియోజకవర్గ టీడీపీ ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కర్తవ్యబోధ చేశారు. సీఎం పర్యటనలో తొలిసారి కార్యకర్తలతో ఇలా సమావేశం కావడం.. అందునా రెండు గంటలు గడపడం విశేషం. ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలను అమలు చేయడంలో మంచి మార్కులను పొందిన కార్యకర్తలను పేరు పేరునా పిలిచి అభినందించారు. కార్యకర్తల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. బూత్‌ల వారీగా గ్రేడ్‌లు ఇచ్చారు. తణుకు నియోజకవర్గంలో డి గ్రేడ్‌లో 14 బూత్‌లు, బిలో 124, ఏలో 24 ఉన్నాయని వెల్లడించారు. 2029 ఎన్నికల లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. కష్టపడే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఎప్పుడూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ముందుకు వెళ్లలేదు. కాని ఈసారి పార్టీ పోటీ చేసిన చోటల్లా గెలుపొందింది. ఇది పార్టీలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణకు సంకేతం. పార్టీ యంత్రాంగం ఎప్పటి కప్పుడు ప్రతిష్టాత్మకంగానే ఉండాలి. తెలుగుదేశంకు మొదటి నుంచి పటిష్టమైన యంత్రాంగం ఉంది. ఎన్ని ఒడిదుడుకులు, ఇబ్బందులు వచ్చినా పార్టీ మాత్రం ఏనాడూ అధైర్యపడలేదు. కార్యకర్తలు, నేతలు ఎప్పుడూ మా వెంటే ఉన్నారు. ప్రజలు, కార్యకర్తలు నన్ను ఆదరించారు. ఎవరికీ దక్కని గౌరవం పార్టీకి, నాకు దక్కింది. ఇది నా పూర్వ జన్మ పుణ్యమంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో అడుగుపెట్టి

సరిగ్గా 41 ఏళ్ల క్రితం ఇదే రోజు శనివారం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాను. అప్పటి నుంచి ప్రజా ప్రతినిధిగా ప్రజలు నన్ను ఆశీర్వదించారు. సమైక్యాంధ్రలో అత్యధికంగా తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం కల్పించారు. ప్రతిపక్ష పాత్రను పోషించా. విలువలకు కట్టుబడ్డాను. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. నా తుది శ్వాస వరకు ఆంధ్రప్రదేశ్, తెలుగు జాతి అభివృద్ధికి కష్టపడతాను.. అంటూ కార్యకర్త భాస్కరరావు అడిగిన ప్రశ్నకు చంద్రబాబు సమాధానంగా చెప్పారు.

భీమవరం/తణుకు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఈసారి తణుకులో చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను గుర్తు చేస్తూనే, సంక్షేమ పథకాలు, సంపద సృష్టి, అభివృద్ధిపై చంద్రబాబు తన విజన్‌ను ప్రజల ముందు ఆవిష్కరించారు. పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఒక భాగమని స్పష్టం చేశారు. ఉండవల్లి నుంచి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం తొమ్మిది గంటలకు తణుకు చేరుకున్నారు. ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఎన్టీఆర్ పార్క్‌లో పారిశుధ్య కార్మికులతో భేటీ

పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత.. తణుకు అభివృద్ధికి రూ.50 కోట్లు : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం

చీపురు పట్టి.. చెత్త ఊడ్చి.. పారిశుధ్య కార్మికులకు సత్కారం.. కార్యకర్తలకు దిశా నిర్దేశం

అయ్యారు. వారితో కలిసి చీపురు పట్టి చెత్తను ఊడ్చి ఎత్తిపో శారు. ప్రతి ఒక్క పారిశుధ్య కార్మికుడిని ఆప్యాయంగా పలకరించారు. వారితో గ్రూపు ఫొటోలు దిగారు. ఎన్టీఆర్ పార్క్‌కు రెండు నెలల్లో పూర్వ వైభవం తీసుకురావాలని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణకు సూచించారు. కూరగాయల మార్కెట్‌ను సందర్శిం చారు. అక్కడ వ్యర్థాలతో కంపోస్టు తయారు చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఐక్యనగర్ పార్క్‌ను పరిశీలించారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో రూ.60 లక్షలు వెచ్చించి పార్క్‌ను అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు.

ప్రజావేదిక పూర్తి భిన్నం

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎంకు ఇరువైపులా పారిశుధ్య కార్మికులు ఆశీనులయ్యారు. కుర్చీలు లేవు. గోడ మాదిరిగా వేదికను ఏర్పాటుచేశారు. దానిపైనే చంద్రబాబు సహా మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూర్చున్నారు. ప్రజల నుంచి తొలుత వినతులు స్వీకరించారు. సమయాభావంతో ఎక్కువ మంది అభిప్రాయాలను సేకరించలేకపోయారు. ఉన్న కొద్దిపాటి సమయంలో రాష్ట్ర భవిష్యత్తు, ప్రభుత్వ విజన్‌ను ఆవిష్కరించారు. ఇది ప్రజా ప్రభుత్వం అంటూ చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్రపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

గోదావరి జిల్లాల్లో నల్లరేగడి మట్టి ఉంటుంది. ఈ కారణంగా రహదారులు తరచూ దెబ్బ తింటాయి. ఎప్పటికప్పుడు వేసుకోవాలి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. అన్నీ గోతులు పడ్డాయి. మేం రాగానే తొమ్మిది నెలల్లో వాటిని పూడ్చాం. రహదారులు వేస్తాం. జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటాం. తణుకు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నాం. ప్రాధాన్యత క్రమంలో మిగిలిన పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
- చంద్రబాబు

తప్పులు చేసి ఎదురుదాడి

వైసీపీ హయాంలో నేతలు తణుకులో టీడీఆర్ బాండ్‌లను అక్రమంగా ఇచ్చేసి వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఎదురు దాడి చేస్తున్నారు. తప్పు చేసిన వారిని విడిచిపెట్టే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నారాయణ, నిమ్మల రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, బొమ్మిడి నాయకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, అంగర రామ్మోహన్, తోట సీతారామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కావాలి : కలెక్టర్ నాగరాణి



కొత్తగా ఏర్పడిన జిల్లాలో అనేక సమస్యలున్నాయి. అధికారులు, కార్యాలయాలు, ఫర్నీచర్ కొరత అధికంగా వుంది. భీమవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు అవకాశం కల్పించాలి. పారిశుధ్యం, పరిశుభ్రతకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, గ్లాసులు, ప్లేట్లను నిషేధించాం. కలెక్టరేట్‌లో ప్లాస్టిక్‌కు బదులు స్టీలు వస్తువులను వినియోగిస్తున్నాం. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రజలు సహకరిస్తున్నారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నాం.

తణుకును అభివృద్ధి చేయండి - ఎమ్మెల్యే ఆరిమిల్లి



'తణుకు పట్టణ డ్రైనేజీల్లో ఐదేళ్లుగా సిల్టు తీయలేదు. ఇప్పుడు నాలుగడుగుల లోతువున్న సిల్టును తొలగిస్తున్నాం. వచ్చే ఆరు నెలల్లో ప్లాస్టిక్ కవర్ల నిషేధిస్తాం. పారిశుధ్యం, డ్రెయిన్లను మెరుగుపరిచి అభివృద్ధి చేసి చూపిస్తాం. వైసీపీ హయాంలో ఏర్పాటుచేసిన కాలనీల్లో పెద్ద ఎత్తున భూమి కొనుగోలులో అవినీతి జరిగింది. కాపవరం లే అవుట్‌లో మూడు ఎకరాలు కొనుగోలు చేసి 1,335 మందికి పట్టాలు పంపిణీ చేసినా అక్కడ ఎవరూ ఇళ్లు కట్టుకోలేదు. వీరికి ప్రత్యామ్నాయం చూపించాలి. టిడ్కో ఇళ్లను ఆరు నెలల్లో బాధితులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి. జీఅండ్‌వీ కెనాల్ బండ్ రోడ్డు ఏర్పాటుకు మునిసిపాలిటీకి రూ.35 కోట్లు, ఆటోనగర్ భూసేకరణకు రూ.25 కోట్లు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధికి రూ.19.2 కోట్లు, సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి రూ.125 కోట్లు, మేజర్ అవుట్‌పాల్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.288 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.44 కోట్లు, ఇరిగేషన్ పనులకు రూ.42.40 కోట్లు, కొత్తగా నిర్మించే బ్రిడ్జిలు, పాత వాటి స్థానంలో కొత్తవి నిర్మాణానికి రూ.27.30 కోట్లు నిధులు మంజూరు చేయాలి. తణుకు ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి తణుకు అభివృద్ధికి సహకరించాలి' అంటూ స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.



ఎమ్మెల్యేలు పితాని, నాయకర్, పార్టీ నేతలు తోట, మంతెన తదితరులు



చెత్తను ఊడ్చి



చెత్తను ఎత్తి



చెత్తను పోసి



పార్టీ సమావేశంలో.. శ్రేణులు

అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం.?

రసకందాయంలో నూజివీడు పురపాలక రాజకీయం

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

నూజివీడు పురపాలక రాజకీయం రసకందాయంలో పడింది. వైసీపీ చేతిలో ఉన్న ఈ పురపాలకం గతనెల పదిమంది వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి టీడీపీలోకి రావడంతో పురపాలక రాజకీయం గరంగరంగా ఉంది. ఈనెల 18వ తేదీకి నూజివీడు పురపాలక ప్రస్తుత కౌన్సిల్ కొలువుదీరి నాలుగేళ్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటే నాలుగేళ్లు పూర్తయి ఉండాలి. దీంతో టీడీపీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై దృష్టి పెట్టింది. నూజివీడు పురపాలకంలో మొత్తం వార్డులు 32. నాలుగేళ్ల క్రితం జరిగిన పురపాలక ఎన్నికల్లో వైసీపీ 25 వార్డులు గెలువగా, టీడీపీ 7 వార్డులను దక్కించుకుంది. రాష్ట్రంలో అధికారం మారడం, ఆపై జరిగిన పరిణామాలతో వైసీపీ కాన్సిలర్లు పదిమంది టీడీపీలోకి రావడంతో, టీడీపీ బలం 17కు చేరగా వైసీపీ బలం 15 మంది సభ్యులకు పడిపోయింది. ఈ నేపథ్యంలో టీడీపీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులను వైసీపీ నుంచి తమ గుప్పిట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కనీసం 22 మంది సభ్యులు చేతులు ఎత్తి మద్దతు తెలపాలి. దీంతో టీడీపికి మరో ఐదుగురు సభ్యుల మద్దతు అవసరం. టీడీపీ నియోజకవర్గ అధిష్ఠానం వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారిలో ఒకరికి, అలాగే టీడీపీలోని మరో కౌన్సిలర్‌కు వైసీపీ నుంచి మరో ఐదుగురు సభ్యుల మద్దతు కూడగడితే మీకు చైర్మన్ పదవి ఇస్తామని స్పష్టం చేయడంతో, వారిద్దరూ వైసీపీ సభ్యులపై గాలం వేస్తున్నారు. ఇదంతా గమనించిన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మిగిలిన తమ కౌన్సిలర్లను తీసుకుని ఇటీవల ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అయితే 15 మందిలో ఇద్దరు గైర్హాజరు కావడం గమనార్హం. దీంతో టీడీపీవర్గం ఈ ఇద్దరితో పాటు మరో ముగ్గురు కోసం వేట ప్రారంభించారు. అవిశ్వాస తీర్మానం గెలవడానికి అవసరం అయితే స్థానిక ఎమ్మెల్యే ఓటును సైతం ఉపయోగించుకుని, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీడీపీ కైవసం చేసుకోవచ్చనే వ్యూహంలో టీడీపీ ఉంది.

ప్రస్తుత చైర్మన్ రాజీనామా చేస్తే..

అవిశ్వాస తీర్మానంలో తాము నెగ్గలేమని ప్రస్తుత వైసీపీ చైర్‌పర్సన్ భావించి రాజీనామా చేస్తే చైర్మన్ ఎన్నిక జరగాలంటే కనీసం మూడు నెలలు సమయం పడుతుందని తెలుస్తోంది. మరోవైపు అవిశ్వాసం తెలుపుతూ ఆ తీర్మానం నోటీసును పురపాలక కమిషనర్‌కు ఇచ్చిన తర్వాత, దానిని కమిషనర్ జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ నుంచి నెలరోజుల లోపు ఎన్నిక నిర్వహించ మని సబ్ కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చిన తర్వాత 15 రోజులలోపు సబ్ కలెక్టర్ కౌన్సిల్‌ను సమావేశపరిచి, అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు.

అపరాల రైతుల.. కష్టాలు తీరేలా!



జాలిపూడిలో పెసలు ఆరబోస్తున్న రైతులు

- కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటు
- ఐదు సొసైటీల పరిధిలో సన్నాహాలు
- కసరత్తు చేస్తున్న అధికారులు
- రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అపరాల రైతుల నుంచి పంట లను మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగింది. ఈ ఏడాది తెగుళ్లతో కొనుగోళ్ల ప్రక్రియ జరగడం లేదని రైతుల ఆందోళనతో జిల్లా యంత్రాంగం కసరత్తు చేసింది. అయితే మినుములు, పెసలు కోతలు కోసి పంట లు సిద్ధంగా ఉన్న దశలో ఇంకా కొనుగోలుకు చర్యలు తీసు కోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కృష్ణా కాల్వ కింద ఏలూ రు, దెందులూరు, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు అపరాలు సాగు చేశారు. పల్లా తెగులు, వైరస్ తెగుళ్ల వల్ల పంటల దిగుబడి తగ్గింది. గత రెండేళ్ల నుంచి మార్కెట్ రేటు బాగుండడంతో రైతులకు డిమాండ్ పరంగా ధర బాగానే పలికింది. ఈసారి తెగుళ్ల సోకడం దిగుబడులు తగ్గ డంతో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన చేయడంతో జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాలతో మార్క్‌ఫెడ్ అధికారులు పెసలు క్వింటాల్ రూ.8,682, మినుములు రూ.7,400 కొనుగోలు చేసేందు కు రంగం సిద్ధం చేస్తు న్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏలూరు డీసీఎంఎస్, జాలిపూడి, వట్లూరు, పెద పాడు, దెందులూరు సొసైటీల ప్రధాన కేంద్రంగా రైతుల నుంచి అపరాలను కొనుగోలు చేస్తారు. వీటి కింద ఉన్న రైతు సేవా కేంద్రాలు సబ్ సెంటర్లుగా కొనుగోలుకు పనిచేస్తాయి. పంటల విస్తీర్ణంతో ఆయా రైతుల రైతుసేవా కేంద్రం లో పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. వారికి నిర్దేశిత తేదీల్లో పంటలను కేంద్రాలకు తీసుకురావాలని అధికారులు సమాచారం అందిస్తారు. పంట విక్రయించిన పది రోజుల్లో రైతుల ఖాతాల్లో మద్దతు ధర మొత్తాలు జమ చేస్తారు. తొలిసారిగా ఈ కేంద్రాల ఏర్పాటుతో అపరాల రైతులు విక్రయ కష్టాల నుంచి గట్టెక్కనున్నారు.

నిబంధనల మేరకు కొంటాం..

ప్రభుత్వం నిబంధనల మేరకు 12 శాతం తేమలోపు ఉంటే కొనుగోళ్లకు రైతుల రిజిస్ట్రే షన్ల పూర్తి చేయగానే చర్యలు తీసుకుంటాం. పెసలు 2056 మెట్రిక్ టన్నులు, మినుములు 2099 మెట్రిక్ టన్నులను రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. తొలిసారి కాబట్టి కొన్ని ఇబ్బందులుంటాయి. గోనె సంచుల్లో రైతుల అపరాలను కేంద్రాలకు వారే తెచ్చుకోవాలి.
- మార్క్‌ఫెడ్ డీఎం ప్రసాద్‌గుప్తా

మంచి పరిణామం



రైతు సంఘాల ఆందోళనలతో ప్రభుత్వం మద్దతు ధరకు అపరాల కొనుగోలుకు ఉప క్రమించింది. ఇది మంచి పరిణామం, అయితే నిబంధనల్లో రైతులకు న్యాయం చేయాలి. గోనె సంచులు, ఇతర ఏర్పాట్లు చేయాలి.
- కె.శ్రీనివాస్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు : కలెక్టర్



ఏలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యల తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. తాగునీటి సరఫరా, వడగాల్పులు, టెన్త్ పరీక్షలు నిర్వహణ, పీ-4 సర్వే అంశాలపై శనివారం టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. వేసవిలో వడగాల్పులు, ఎండలు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని, రానున్న మూడు నెలలు ఎంతో కీలమని, సమ్మర్ యాక్షన్‌ను అమలు చేయా లని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈనెల 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు.

మామపై అల్లుడి హత్యాయత్నం 7

ముగిసిన ఇంటర్ థియరీ పరీక్షలు

ఎండా కాలం మొదలైంది. వేసవి తాపం నుంచి గట్టెక్కేది ఎలా? అంటూ ప్రతి ఒక్కరిలోనూ ఆందోళన పెల్లుబుకుతోంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు దంచి కొట్టే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలోనే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలంటూ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన శరీరానికి పోషకాలు సమృద్ధిగా అందిస్తే ఎంతటి తాపం నుంచైనా బయటపడొచ్చని సూచిస్తున్నారు. అందుకే ఈ వేసవిలో వచ్చే మధుర ఫలాలను స్వీకరించి ఉష్ణ తాపం నుంచి బయట పడాలంటూ వైద్యులు సూచిస్తున్నారు.

- గణపవరం/తణుకు రూరల్,(ఆంధ్రజ్యోతి)



మధుర ఫలం..



పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా పండ్ల దిగుమతి - పుచ్చకాయలకు పెరిగిన డిమాండ్ - ధరల పెరుగుదలతో హడల్

వేసవి తాపాన్ని తీర్చి చల్లదనాన్ని అందించే పుచ్చకాయ మార్కెట్‌ను ముంచెత్తుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంట వచ్చేందుకు ఇంకా సమయం ఉండటంతో వ్యాపారులు తమిళనాడు నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మార్కెట్‌లో ముఖ్యంగా రహదారుల వెంబడి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా పుచ్చకాయలు ఎరుపు రంగుతో ఉండటం చూశాం. ఇప్పుడు పసుపు రంగులో కూడా వస్తున్నాయి. సాధారణ పుచ్చకాయ కంటే తీపి, నీరు అధికం. గుజ్జు గట్టిగానే ఉంటుంది. వీటిని కొనేవారు వివరాలు అడుగుతూ ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. పుచ్చకాయల్లో పోషకాలు, కాల్షియం, పిండిపదార్థాలు అధికంగా ఉంటాయి. తమిళనాడు నుంచి దిగుమతి చేసుకుంటున్న టన్ను పుచ్చకాయలు రూ.17 వేలు కాగా రవాణాఖర్చులతో కలిపి సుమారు రూ.21 వేలు అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ.30 నుంచి 35 వరకు విక్రయిస్తున్నారు. సైజును బట్టి కాయ రూ.60 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. ఎండలు ముదరకముందే పుచ్చకాయల ధరలు మండిపోవడంతో కొనుగోలుదారులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.



భారీగా పెరిగిన దుకాణాలు

ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి పండ్లు, కాయలు భారీగా దిగుమతి అవుతున్నాయి. వాటిలో పుచ్చకాయలు, అనాస, బొప్పాయి, కర్బూజ, సపోట, కర్బూజలోనే పచ్చని, పసుపు రంగుల్లో ఉండే కాయలు ఎక్కువ. వీటిలో పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు సంవత్సరం పొడువునా ప్రజలకు అందుబాటులో ఉంటున్నా వేసవి నేపథ్యంలో వీటి అమ్మకాలు, షాపులు పెరిగాయి.



అడవిలో మాత్రమే దొరికే మొర్రి పండ్లు..

అడవిలో మాత్రమే లభించే పండ్లలో చాలా ముఖ్యమైనవి మొర్రి పండు, జీడి మామిడి, తునిక పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వేసవిలో వచ్చే ఈ పండ్లను అడవి నుంచి తీసుకొచ్చి మార్కెట్లలో విక్రయిస్తూ ఉంటారు. పట్టణ ప్రాంతాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. ఇవి కేవలం వారం, రెండు వారాలు మాత్రమే ఉంటాయి. వీటి కోసం గిరిజన ప్రాంతాలకు చెందిన కూలీలు కోసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతూ ఉంటారు. వీటిని పట్టణాల్లో వంద గ్రాముల లెక్క విక్రయిస్తూ ఉంటారు.

మండిపోతున్న ధరలు...



కలకత్తా వంటి ప్రాంతాల్లో పండే లిచ్చి కాయలు ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయి. కొబ్బరి బొండాలు ఒక్కొక్కటీ రూ. 20 నుంచి 25లకు, లీటరు బాటిల్ కొబ్బరి నీళ్లు రూ. 100 వరకూ విక్రయిస్తున్నారు. పుచ్చ కాయలు 180 నుంచి 250ల, బొప్పాయి కిలో రూ. 50 నుంచి 100 వరకూ, కర్బూజ పచ్చని రకం కిలో రూ. 40లు, పసుపు రూ. 50 నుంచి 60ల మధ్య, అమ్మకాలు చేస్తుండగా లిచ్చి కిలో రూ. 300 నుంచి రూ. 400 వరకూ అమ్మకాలు చేస్తున్నారు. తాటి ముంజులు 12 రూ. 50 నుంచి 100 మధ్య అమ్మకాలు చేస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే ధరలు ఇలా ఉంటే ఇక ముందు ఇంకెతలా పెరిగిపోతాయేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఈ వేసవిలో పండ్లను వినియోగించాలంటూ సూచిస్తుండగా ఈ ధరలను చూసి మనం కొనుగోలు చేయగలమా అంటూ ఆందోళన చెందుతున్నారు.

వేసవిలో మాత్రమే దొరికే తాటి ముంజలు..



వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజలకు భలే గిరాకీ ఉంటుంది. కొందరు వ్యాపారులు మెట్ట ప్రాంతాల్లోని తాటి చెట్ల నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చి గోదావరి జిల్లాల్లో విక్రయిస్తూ ఉంటారు. చెట్ల నుంచి అప్పటికప్పుడే తెంపుకొచ్చి పట్టణాల్లో రోడ్ల పక్కన పెట్టి విక్రయిస్తూ ఉంటారు. గతంలో ఒక తాటి ముంజ 12 రూపాయల చొప్పున విక్రయిస్తూ ఉంటారు. ఈ తాటి ముంజలో మంచి పోషకాలు ఉంటాయి. వంద గ్రాముల తాటి ముంజలో 43 కేలరీల శక్తి, 87.6 గ్రాముల నీటితో పాటు విటమిన్లు, ఐరన్, జింక్, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ వంటి ఎన్నో పోషకాలు మన శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. వేసవి తాపాన్ని తీర్చడంలో తాటి ముంజలు కీలక పాత్రను పోషిస్తాయి. అందుకే వీటి విలువ తెలిసిన వారు ఎంతధరైనా పెట్టి వీటిని కొనుగోలు చేస్తుంటారు.

వాటర్ యాపిల్స్ పట్ల మక్కువ

మార్కెట్‌లో వాటర్ యాపిల్‌ను కొనుగోలు చేసేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. గణపవరం మండలంలోని బొబ్బిలి వంతెనపై వీటిని విక్రయిస్తున్నారు. ఈ వాటర్ యాపిల్‌ను రోజ్‌యాపిల్ అని కూడా పిలుస్తున్నారు. భారతదేశంలోని పలు ఉష్ణమండల ప్రాంతాల్లో ఇవి బాగా పండుతాయి. మార్చి నుంచి ఆగస్టు వరకు ఈ పంట లభిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లోనూ వీటిని కొనుగోలు చేసి మార్కెట్లకు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఈ పండ్లు మొదటఆకుపచ్చగానూ పక్వానికి వచ్చేటప్పటికి గులాబి రంగులో మారతాయన్నారు. కాయ లోపలు గుంజుతెల్లగా ఉంటుంది. ఎక్కువ నీటిశాతం కలిగి ఉంటాయని ఆరోగ్యదాయని అని వీటిని పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. డజను రూ. 30 నుంచి 40 వరకు విక్రయిస్తున్నారు.

పుచ్చలో పుష్కలమైన విటమిన్లు



పుచ్చకాయల్లో పిండి పదార్థమే కాదు విటమిన్ ఏ, బీ1, బీ6, సి, పోటాషియం, మెగ్నీషియం, ఫైబర్, కాల్షియం, ఐరెన్, లైకోటిన్ వంటి పోషకాలుంటాయి. విటమిన్-ఏ గుండె, కిడ్నీ, కళ్లు, ఊపిరితిత్తులకు ఎంతో మేలు చేస్తుంది. విటమిన్-సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్, రోగనిరోధక శక్తిని పెంపొందిస్తూ జలుబు, ఇన్‌ఫెక్షన్‌ల బారినపడకుండా కాపాడుతుంది. దీనిలో సిట్రోలీన్ అనే ఆమ్మైనో ఆమ్లం రక్తపోటు తగ్గించడానికి జీవక్రియ చురుగ్గా సాగటానికి దోహదపడుతుంది. అలాగే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది దివ్య ఔషధం.

కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారిణి, పిప్పర

22 లోగా స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

ఏలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల కోసం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. 2024-25సంవత్సరంలో ఆర్థిక సంవత్సరానికి బీసీలకు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీ,(బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ) చదువుకున్న నిరుద్యోగులకు, మేదర, కుమ్మరి,శాలివాహన వృత్తిదారులకు వస్త్రాల అల్లకం, కుండలు తయారీ చేసుకుంటున్న వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకు లోను, ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్:// ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హతా పత్రాలతో నెట్ సెంటర్/ మీ సేవా, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఆలోచింపజేసిన నాటికలు

పాలకొల్లులో ఘనంగా కళాపరిషత్ వార్షికోత్సవం - ఆకట్టుకున్న ప్రదర్శనలు



కిడ్నాప్ నాటికలోని ఓ సన్నివేశం

పాలకొల్లు అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళా పరిషత్ 16వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ రోడ్డులోని ఖాళీ ప్రదేశంలో శనివారం రాత్రి జాతీయ స్థాయి నాటికల ప్రదర్శన ప్రారంభమైంది.ఈసందర్భంగా జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షుడు కె.వి.కృష్ణవర్మ అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టినిల్లు అయిన పాలకొల్లులో ఎన్నో కళా పరిషత్‌లు నిర్వహించే వారని, ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకుని పాలకొల్లు కళాపరిషత్ గత 16 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నాటికల పోటీలను నిర్వహించి, కళాకారులను, కళారంగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలతో ఏటా నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటకాలను, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అందుకు కృత నిశ్చయంతో ఉన్నట్టు తెలిపారు. కళాకారులకు ఉపయోగపడేలా పట్టణంలో బివిరాజు, ఎన్టీఆర్ కళాక్షేత్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. వచ్చే ఏడాది అక్కడే పరిషత్ నిర్వహించుకునేలా పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బన్నీ వాసు, పలువురు పట్టణ ప్రముఖులు, పరిషత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. ఈ నాటికకు రచయితగా వల్లూరి శివ ప్రసాద్, (మూలకథ పొత్తూరి విజయలక్ష్మి), గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ ఉన్నారు. శ్రీనివాసరావు పాత్రను గంగోత్రి సాయి, పద్మావతి పాత్రను జి.వసంత యామినీ, చలపతి పాత్రను పి.రంగ నాయకులు, వరాహ స్వామి పాత్రను వి.వి.స్వామి రసవత్తరంగా పోషించారు. సాంకేతిక వర్గంలో మేకప్ పుచ్చల శేషగిరి, శ్రీధర్, సంగీతం కె.సత్యనారాయణ మూర్తి, రంగాలంకరణ పామర్తి వేణు నిర్వహించారు. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య వచ్చే విభేదాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజం. వీటిని జయంతి ఆదర్శ దంపతుల్లా ఎలా గడపొచ్చో నటించి చూపించారు.
- 2వ ప్రదర్శన కత్రపాడు ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో 'కిడ్నాప్' నాటికను ఆసక్తికరంగా ప్రదర్శించారు. చెరుకూరి సాంబశివరావు, రంగాలంకరణ ఎల్.అనీల్,సంగీతం సురభీ నాగరాజు,ఆహార్యం ఎస్.అమృత వర్షిణీ కాగా, పాత్రధారులు రఘుపతి చెరుకూరి సాంబశివరావు, వసుంధర ఎస్ అమృత వర్షిణి, భాస్కర్ ఎస్.కె. హసన్, సౌమ్య ఎస్.పూజిత, కోటేశ్వరరావు నడింపల్లి వెంకటేశ్వరరావు, ఉదయ్ లోకేష్‌లో తమ పాత్రలకు అనుగుణంగా అభినయించారు. నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తల్లిదండ్రులను దూరం చేసుకుంటోంది. ఈ అంశాన్ని తీసుకుని కథారచయిత అద్భుతంగా రూపొందించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజేసే సందేశాత్మక నాటికగా నిలిచింది. నటీనటులు తమ పాత్రలకు జీవం పోశారు.



వందేళ్ల వసంతం లోగో



మార్టేరు వరి పరిశోధనా కేంద్రం భవనం



శత వసంతాల వైపు పరుగులు

వరి వంగడాల సృష్టిలో మార్టేరు వరి పరిశోధనా కేంద్రం నెంబర్ వన్ - వందేళ్లలో 70 రకాల ఆవిష్కరణలు

పెనుమంట్ర, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మార్టేరులోని ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం వందేళ్ల పండుగకు ముస్తాబైంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని మార్టేరు వరి పరిశోధన కేంద్రం నూతన వంగడాల సృష్టిలో అన్నదాత ఇంట సిరులు కురిపిస్తోంది.. 1925లో స్థాపించిన ఈ పరిశోధనా కేంద్రం అంచెలంచెలుగా ఎదుగుతూ నిత్య ప్రయోగశాలగా మారింది. వందేళ్లలో 70 వరి రకాలను సృష్టించి అన్నదాతలకు అందించిన ఘనత మార్టేరు వరి పరిశోధన కేంద్రానికే దక్కింది.

అతి పురాతన చరిత్ర...

మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం భారత దేశంలోనే చాలా పురాతనమైంది. 1925 సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు.2025 మార్చి నాటికి శత వసంతాలు పూర్తిసుకోనుంది. ఏటా దేశం మొత్తం మీద రూపొందించిన కొన్ని కొన్ని వేల వరి రకాలను చీడపీడలను తట్టుకునే శక్తి కొరకు ఇక్కడ పరిశీలిస్తున్నారు. మార్టేరు పరిశోధనా స్థానం వరి పరిశోధనలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో, ఇతర ప్రైవేట్ సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉంది.

పది దేశాల్లో వరి వంగడాల సాగు...

దోమను తట్టుకునే వజ్రం వరి వంగడం దేశంలోనే మొదటి సారి తయారు చేసి ఘనతను సృష్టించింది. ఎంటీయూ 1001, 1010, స్వర్ణ, ప్రభాస్, ఇంద్ర, వరి రకాలు ప్రాచుర్యం పొంది ప్రపంచంలో సుమారు 10 దేశాల్లో ఈ రకం 11 మిలియన్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ సంస్థలో రైతుల కోసం నిత్యం శ్రమిస్తూ కాలనుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా వరి వంగడాలను సృష్టిస్తున్నారు. వరి వంగడాల రూపకల్పనలోనే కాకుండా రైతులకు అవసరమయ్యే యాజమాన్య పద్ధతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి అధిక దిగుబడి సాధించే దిశగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.ఇప్పటి వరకు 70 రకాల వంగడాలను విడుదల చేయగా అందులో రెండు హైబ్రిడ్ రకాలున్నాయి. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన రకాలు దేశంలోని 11 రాష్ట్రాల్లో 11 మిలియన్ హెక్టార్లలో సాగవుతూ సాలీనా రూ. 35వేల కోట్ల ఆదాయాన్ని అర్జిస్తున్నాయి. దేశం నుంచి ఎగుమతి అవుతున్న బాస్మతి యేతర రకాల్లో 30 శాతం వాటా కలిగి ఉన్నా యి. భారత దేశంతో పాటు శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్, ఉగాండా, కెన్యా, ఇండోనేషియా వంటి దేశాల్లో వరి వంగడాలు సాగవుతున్నాయి.

అన్నదాతకు సిరులు...

చంద్ర (ఎంటీయూ-1153) రకం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. విత్తనోత్పత్తిదారులకు సాలీన 200 కోట్ల రూపాయలు ఆర్జించి పెడుతోంది. అంతే కాక ఈ పరిశోధనా స్థానం నుంచి గాఢ నత్రికామ్లం ఉపయోగించి వరి విత్తనాల్లో నిద్రావస్థను తొలగించే పద్ధతి, ఎలుకల నివారణకు బర్రో ఫ్యూమిగేటర్, కోతుల నివారణకు సోలార్ కంచె వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా రూపొందించారు.

అనువైన వంగడాలపై దృష్టి..



మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి వంగడాల రూపకల్పనలో పరిశోధనలు చేస్తున్నాం. అధిక శాతం రైతులు సన్నగింజ సాగుకు మొగ్గు చూపుతున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా అధిక దిగుబడితో పాటు తెగుళ్ల తట్టుకుంటూ తక్కువ కాల పరిమితి కలిగిన రకాలను రూపొందిస్తున్నాం. అలాగే ముంపు సమస్యను తట్టుకుని నిలబడి రైతుకు దిగుబడిని ఇచ్చి మిల్లరకు అనువైన రకాలు, అన్నం పొడిగా ఉండి పొడవు గింజ రకాలను వృద్ధి చేస్తున్నాం.

డాక్టర్ టి.శ్రీనివాస్, ఏడీఆర్



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ సర్వే : ఎస్పీ



జంగారెడ్డిగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు వరకే పరిమితమైన డ్రోన్ సర్వే ఇక నుంచి ప్రతి పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ కిశోర్ తెలిపారు.శనివారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీలలో భాగంగా ఎస్పీ రికార్డులు పరిశీలించారు. ముందుగా పోలీసు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీఎస్పీ రవిచంద్ర ఎస్పీకి మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా గత ఏడు నెలల కాలంలో సుమారు రూ.8 కోట్ల విలువైన చోరీ సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రతి అపార్ట్‌మెంట్, వ్యాపార సముదాయాల వద్ద తప్పని సరిగా సీసీ కెమేరాలు అమర్చుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే శిక్షణలో ఉన్న సిబ్బందిని అవసరమైన చోట్ల నియమిస్తామన్నారు. జంగారెడ్డిగూడెంలో త్వరలో ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఆయా స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

నరసాపురంలో సందడి చేసిన హీరో నిఖిల్



నరసాపురం, మార్చి15 (ఆంధ్రజ్యోతి) : హీరో నిఖిల్ శనివారం నరసాపురంలో సందడి చేశారు. మిషన్ హైస్కూల్ రోడ్డులోని శిరిగినీడి అపార్ట్‌మెంటట్‌లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చిన ఆయన సాయంత్రం వరకు ఉన్నారు. పరిసర ప్రాంత ప్రజలతో పాటు కలిసేందుకు విచ్చేసిన అభిమానులతో కలిసి ఫోటోలు దిగారు. చిట్‌ఛాట్‌లో కార్తికేయ-3 వచ్చే అవకాశం ఉందా అని అభిమానుల ప్రశ్నలకు నిఖిల్ సమాధానమిస్తూ ప్లానింగ్ జరుగుతోందన్నారు. త్వరలో మళ్లీ నరసాపురం వస్తానని, తనకి ఈ గోదావరి తీరం, ఇక్కడి వాతావరణం, సంప్రదాయాలు, మర్యాదులు బాగా నచ్చాయన్నారు. నిఖిల్ భార్య బంధువులు నరసాపురంలో ఉంటున్నారు. కార్తికేయ-2 విజయవంతమైనప్పుడు నిఖిల్ నరసాపురం వచ్చి, వేములదీవి గ్రామంలోని వెంకటేశ్వరస్వామీ ఆలయంలో పూజలు చేశారు. మళ్లీ ఇప్పుడు వ్యక్తిగత పనులపై వచ్చిన్నట్లు తెలియవచ్చింది. సాయంత్రం తిరిగి హైద్రాబాద్ వెళ్లిపోయారు.



సీఎం తాతయ్యకు బాలుడి అభివాదం



పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడిన వారిని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు



బస్సులోంచి ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

తణుకులో స్వచ్ఛాంధ్ర

» పర్యావరణ పరిరక్షకులకు సీఎం చంద్రబాబు సన్మానం



సీఎంకు పుష్పం అందజేస్తున్న ఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అస్మి



రాగి పిండితో టీ గ్లాసులు తయారు చేసిన వారితో సీఎం చంద్రబాబు

తణుకు/తణుకు రూరల్/ఇరగవరం/అత్తిలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలో స్వర్ణాంధ్రప్రదేశ్-స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిమిత్తం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు ఉదయం తొమ్మిది గంటలకు చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రాష్ట్ర ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్, పశ్చిమ జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారా యణ, బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, బొమ్మిడి నాయకర్, పార్లమెంటు మాజీ సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి, మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకటకృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి ఘన స్వాగతం పలికారు.

ఐక్య నగర్ పార్కుకు రూ.60 లక్షల నిధులు

తణుకు పట్టణంలోని ఐక్య నగర్‌లో గల మునిసిపల్ పార్కుతో పాటు పలు పార్కులను సీఎం చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఐక్యనగర్ పార్కు వద్ద కాలనీ వాసులతో మాట్లాడుతూ పార్కులను శుభ్రంగా వుంచాలని కోరారు. ఐక్యనగర్‌లో పీ-4 పద్ధతిలో అభివృద్ధికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐక్య నగర్‌లో పార్కు అభివృద్ధికి స్థానికులు అర ఎకరం స్థలం కేటాయించి రూ.30లక్షలు అందజేస్తామని ప్రకటించగా ప్రభుత్వం కూడా రూ.30 లక్షలు అందిస్తుందని సీఎం తెలిపారు.

రూ.10 లక్షలతో సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ యూనిట్

తణుకు పాతూరు కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో రూ. 10 లక్షలతో సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ యూనిట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. మార్కెట్‌లో ప్రతిరోజు టన్ను కూరగాయల వ్యర్థాలు వస్తాయని వాటి నుంచి వేస్టు డిస్పోజ్ చేసే యంత్రాలను ఉపయోగిస్తారన్నారు. రూ.50 వేలు పెట్టుబడితో రూ.1.17 లక్షల ఆదాయం సంపాదించే అవకాశం ఉందన్నారు.

డిస్పోజ్ యంత్రాల పరిశీలన

తణుకు మహిళా డిగ్రీ కాలేజీ వద్ద హోల్‌సేల్ మార్కెట్‌లో కూరగాయలు నిల్వ ఉంచడంతో వచ్చే వేస్ట్‌ను ఆన్‌సైట్ కంపోస్టు ద్వారా డిస్పోజ్ చేసే యంత్రాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రోజుకు ఒక టన్ను చొప్పున చెత్త వేస్తే కంపోస్టు తయారవుతుందన్నారు. ఈ ప్రయోగం తణుకు నుంచే మొదలు పెడుతున్నామని అధికారులు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పారిశుధ్య కార్మికులు, పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడిన ప్రజాప్రతినిధులను సీఎం చంద్రబాబునాయుడు శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు. వారిలో నందిగామ మాజీ సర్పంచ్ పెచ్చేటి బొల్లయ్య, తొర్రేడు గ్రామ పంచాయతీకి సంబంధించిన వనజా, అంగన్‌వాడీ వర్కర్ గాదం లక్ష్మిలతోపాటు పారిశుధ్య కార్మికులు దువ్వాపు గంగాధరరావు, చిక్కమాంబ వెంకటేశ్వరరావు, తొలపు కమల, కొత్తపల్లి దుర్గలను సన్మానిరారరు.

ఆకట్టుకున్న స్టాల్స్

బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. పర్యావరణాన్ని హితం చేసే డిస్పోజబుల్ వస్తువులు, డ్వాక్రా సంఘాలు తయారు చేసిన గన్నీ బ్యాగులు, సోలార్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

ఆదుకుంటామంటూ భరోసా

నందిని అనే మహిళ తన తల్లికి పక్షవాతం వచ్చి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్టు తెలుపుతూ సీఎం రిలీఫ్ ఫండ్, పెన్షన్ అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు.



బాలుర ఉన్నత పాఠశాల వద్ద టీడీపీ నేత పట్టాభిరామ్‌ను అడ్డుకున్న పోలీసులు



పురమిత్ర యాప్ తీరును పరిశీలిస్తున్న చంద్రబాబు



సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్‌పై వివరిస్తున్న కమిషనర్ రామ్‌కుమార్



ఐక్య నగర్ కాలనీ వాసులతో సీఎం చంద్రబాబు



తణుకు షర్మిష్ఠ జంక్షన్‌లో రోడ్డు పక్కన టిఫిన్ చేస్తున్న మంత్రి నిమ్మల



ప్రజావేదిక స్టాల్ వద్ద మహిళతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ముగిసిన ఇంటర్ థియరీ పరీక్షలు

» రేపటి నుంచి పూర్తిస్థాయిలో మూల్యాంకన

ఏలూరు అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) :రెగ్యులర్ ఇంటర్మీడియట్ థియరీ ప్రధాన పరీక్షలు శనివారం ముగిశాయి. ఈనెల 17, 18 తేదీల్లో సుమారు 600మంది విద్యార్థులకు 15 కేంద్రాల్లో జరుగనున్న బ్రిడ్జికోర్సు పరీక్షలతో మొత్తం పరీక్షలు ముగుస్తాయి. శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం పరీక్షలకు జిల్లాలో మొత్తం 13,390 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 12,930మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 12,238 మందికి 11,992 మంది, ఒకేషనల్ విభాగంలో 1152 మందికి 938 మంది హాజరయ్యారని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు.

రేపటినుంచి జవాబుపత్రాల మూల్యాంకన

ఇంగ్లీషు, తెలుగు, గణితం, హిందీ, పౌరశాస్త్రం సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనప్రక్రియ ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆర్ఐవో తెలిపారు. మూల్యాంకన విధులకు నియమితులైన ఎగ్జామినర్లు ఈనెల 17న ఉదయం పది గంటలకు, స్క్రూటినైజర్లు 18న ఉదయం పది గంటలకు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ముగిసిన దూరవిద్య ఇంటర్ పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. శనివారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 121 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 99 మంది, వాణిజ్యశాస్త్రం పరీక్షకు 295 మందికి 264 మంది హాజరయ్యా రని ఏలూరు జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

నేటినుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏలూరు అర్బన్ : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో ఫారెస్టు రేంజి అధికారులు (ఎఫ్ఆర్‌వో), ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ల ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తు న్నట్టు డీఆర్వో విశ్వేశ్వరరావు తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఈ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఏలూరు సమీపం లోని వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టంచేశారు.

పదోన్నతుల కోసం డీఎంహెచ్‌వోకు వినతి

ఏలూరు అర్బన్ : వార్డు హెల్త్ సెక్రటరీ నుంచి ఏఎన్ఎంలుగా, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఫిమేల్)గా పదోన్నతులు ఇవ్వాలని అభ్యర్థించారు. వైద్య ఆరోగ్య శాఖ మహిళా ఉద్యోగుల సంక్షేమ సం ఘం జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి నేతృత్వంలోని బృందం శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యాప్‌లు, పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఉద్యోగినుల సంఘం నాయకులు నాగమణి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

కోకో కాయలు కోస్తూ.. విద్యుదాఘాతంతో మహిళ మృతి

టీనర్సాపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురంలో విద్యుదా ఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. టీ.నర్సాపురంకు చెందిన పుప్పాల లక్ష్మి (35) ఒక రైతు పొలంలో కోకో కాయలు కోసేందుకు వెళ్లింది. గెడతో కాయలు కోస్తుండగా చెట్టు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు గెడ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెను చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య మృతిని తట్టుకోలేక భర్త నారాయ ణస్వామి అస్వస్థతకు గురికావడంతో అతడిని బంధువులు వైద్యం కోసం ఏలూరు తరలించారు. ఆయన ఇద్దరు సంతానం ఉన్నారు.

బిల్డింగ్ నుంచి పడి పెయింటర్ మృతి

భీమవరం క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్‌కు పెయింట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి చికిత్స పొందుతూ పెయింటర్ మృతి చెందాడు. వన్‌టౌన్ స్టేషన్ రైటర్ చక్రవర్తి తెలిపిన వివరాలివి.. భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డుకు చెందిన తువ్వి వెంకన్న అనే వ్యక్తికి బంధువు కుమారుడు చీర శివకుమార్ (36) భీమవరం వచ్చి పెయింటింగ్ వేస్తున్నాడు. అతడిది ఏలూరు జిల్లా. ఈక్రమంలో ఈనెల 12న భీమవరం పట్టణంలోని మారుతీ నగర్‌లో అతడు పెయింటింగ్ వేయడానికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కింద పడిపోయాడు. వెన్నెముకకు తీవ్ర గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 14వ తేదీ రాత్రి 10.30 గంటలకు మృతి చెందాడు. ఈమేరకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ రైటర్ తెలిపారు.

పాము కాటుతో ఒకరు..

జీలుగుమిల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన పి.నారాయణపురం శివారు కోరుటూరులో జరిగింది. కామవరపుకోట వెంకటేశ్వర పౌల్ట్రీలో లక్కవరానికి చెందిన మెండ్రగుత్తి ప్రసాద్(40) కొంత కాలంగా పని చేస్తున్నాడు. శనివారం మిత్రుడితో కలిసి పి.అంకంపాలెంలో ఓ శుభకార్యానికి బైక్‌పై వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో కొరుటూరు వద్ద బహిర్భూమికి వెళ్లగా పొదల వద్ద పాముకాటుకు గురయ్యాడు. వెంట ఉన్న మిత్రుడు అతడిని బైక్‌పై తాడువాయి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. మృతుడు ప్రసాద్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి పడి.. ఒకరి మృతి



(రాంబాబు మృతదేహం)

పెదవేగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన మరీదు రాంబాబు(57), భార్యతో కలిసి కృష్ణాజిల్లా బొమ్ములూరులోని సోదరి ఇంట్లో జరుగుతున్న వివాహ వేడుకకు శనివారం ఉదయం వెళ్లాడు. భార్య నాగశిరోమణిని బొమ్ములూరులోనే వదిలి, తిరిగి విజయరాయి రావడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బి.సింగవరం సమీపంలోకి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి, రహదారి పక్కన చెట్టును బలంగా ఢీకొట్టి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మామపై అల్లుడి హత్యాయత్నం

» తాగొచ్చి కుమార్తెను కొడుతున్న అల్లుడిని మామ ప్రశ్నించినందుకు..

ఏలూరు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అల్లుడు తాగి వచ్చి కుమార్తెను కొట్టడంతో ప్రశ్నించిన మామపై పలుమార్లు దాడి చేసి హత్యాయత్నానికి అల్లుడు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం కబడ్డీ కాలనీకి చెందిన ధర్మవరపు శ్రీను గతంలో ఆటో డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. అతడి కుమార్తె జ్యోతికి 18 ఏళ్ల క్రితం కొత్తపల్లి వెంగళరావుతో వివాహమైంది. కొంతకాలం కాపురం బాగానే సాగినప్పటికీ మద్యానికి బానిసైన వెంగళరావు ఐదేళ్లుగా రోజూ తాగి వచ్చి ఆమెను కొడుతూ తిడుతూ వేధిస్తున్నాడు. ఇటీవల ఆమెను చిత్రహింసలకు గురిచేయడంతో తండ్రి ఇంటికి జ్యోతి వచ్చేసింది. ఈనెల 14వ తేదీ రాత్రి శ్రీను ఇంటికి అల్లుడు రావడంతో తన కుమార్తెను ఎందుకు కొడుతున్నావని అడుగగా మాటమాట పెరిగి అల్లుడు తనతో తెచ్చుకున్న బ్లేడుతో మామపై దాడి చేసి వెళ్లిపోయాడు. మళ్లీ రాత్రివేళ వచ్చి తన భార్యను పంపించాలంటూ గొడవకు పాల్పడి శ్రీనును కత్తితో పొడిచాడు. అతడి పేగులు బయటకు వచ్చేశాయి. ఆ సమయంలో ధర్మవరపు శ్రీను భార్య లక్ష్మి, మనుమడు కొత్తపల్లి నాగు అడ్డుపడడంతో అల్లుడు పారిపోయాడు. గాయాలపాలైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేర్పించగా ఆసుపత్రి వైద్యులు అత్యవసరంగా ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కొత్తపల్లి వెంగళరావుపై హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

» బెదిరింపులే కారణమంటున్న తల్లిదండ్రులు » ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స

పాలకొల్లు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గొల్లవానిచెరువు గ్రామంలో శనివారం సాయంత్రం నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి బంధువులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన బలే శ్రీనివాసరావు, అతడి భార్య జయలక్ష్మి బంధువులు కలిసి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చశారు. ఆ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గజపతిరాజు మాధవీలత, భర్త చింతలపాటి మురళీకృష్ణంరాజు తమను ఆర్థికంగా మోసం చేశారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన సంగతి విధితమే. సుమారు రూ.నాలుగు కోట్ల విలువైన ఆస్తి కాజేరంటూ బాధితులు శ్రీనివాసరావు, జయలక్ష్మి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆ దంపతుల కుమారుడు సంతోష్ అనే యువకుడిని దుర్భాషలాడుతూ మీ అంతు చూస్తానని మాధవీలత హెచ్చరించిందని, ఆ కారణంగా మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సంతోష్ తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతూ తమకు మురళీ కృష్ణంరాజు దంపతులనుంచి ప్రాణాపాయం ఉందని, పోలీసులు స్పందించి నిందితులపై చర్యలు తీసుకుని తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంతోష్ ఆరోగ్య పరిస్థితి ఆదోళనకరంగా ఉందని 48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచామని, మెరుగైన వైద్యానికి పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు రూరల్ సీఐ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని కొట్టి.. కుక్క గొలుసుతో బంధించారు



నిడమర్రు మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : క్రొవ్విడి గ్రామంలో పదో తరగతి చదుతున్న బాలుడిని జిరాయితీ భూములలో చేపలు పడుతున్నావంటూ కొట్టి గొలుసుతో బంధించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామ శివారులో కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో గల బీడు భూముల్లో చేపలు పడుతున్నావంటూ ఆ గట్టున వెళ్తున్న తాటిపర్తి లోకేష్‌వరుణ్‌ను కొట్టి.. చేపలు పడితే చంపేస్తామంటూ గండికోట వెంకన్న, పాండు గొలుసుతో బంధించారు. శనివారం బాలుడి తండ్రి తాడిపర్తి బుజ్జి విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు లోకేష్ వరుణ్ ప్రక్క గ్రామమైన బావాయిపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడని, స్కూలు నుంచి వచ్చాక కొల్లేరులో గొర్రెలు కాస్తున్న తన వద్దకు వస్తుంటే చేపలు పడుతున్నావనే ఆరోపణతో వారిద్దరూ తన కుమారుడిని కొట్టుకుంటూ తీసుకెళ్లి కుక్కను కట్టేసే గొలుసుతో బంధించారని వాపోయాడు. విషయం తెలుసుకున్న బాలుడి తాత రెడ్డిఅప్పలనాయుడు. మేనమామ దుర్గాప్రసాద్‌ను పంపగా సరైన సమాధానం చెప్పకుండా సాయంత్రం గ్రామ పెద్దలు మందలించడంతో విడిచి పెట్టినట్టు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జిల్లాల అభివృద్ధిపై వైట్ పేపర్ విడుదల చేయాలి

» బహిరంగ లేఖలో జోగయ్య వెల్లడి

పాలకొల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రాజధాని పేరుతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఒక్క ఏడాదిలోనే రూ.50 వేల కోట్లు వెచ్చించి మౌలిక వసతులు, పరిపాలన భవంతులు, జాతీయ రహదారులు వంటి అభివృద్ధి పనులు చేపట్టిందని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య శనివారం ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. పాలకొల్లులో ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మరో రూ.50 వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇది అవసరమే. కాని జనసేన సిద్ధాంతం ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పరుస్తామని వారాహి యాత్రలో పవన్ చెప్పుకొచ్చారు. గోదావరి జిల్లాల్లో యాత్ర కొనసాగించినప్పుడు ఆయన ఉభయ గోదావరి జిల్లాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధికి ఏ మాత్రం నిధులు కేటాయించారు. జిల్లాలు వారీగా చేసే అభివృద్ధిపై కేటాయిస్తున్న నిధులపై ఏటా వైట్ పేపర్‌ను విడుదల చేయాలని పేర్కొన్నారు.

ఉనికి కోసమే అమరావతిపై అవాస్తవాలు : మంత్రి నిమ్మల

వాస్తవాలను కప్పిపుచ్చి తన ఉనికిని కాపాడుకోవడానికే మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య అమరావతిపై అవాస్తవాలను మాట్లాడుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంత్రి రామానా యుడు నేరేడుమిల్లి గ్రామంలో జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరిరామజోగయ్య అమరావతి రాజధానికి రూ.50 వేల కోట్లు పెడుతున్నారని విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. వాస్తవాలను వక్రీకరించి అమరావతిపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

విస్సాకోడేరు ఆలయంలో చోరీ

పాలకోడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : విస్సాకోడేరు ఫుంతలో మునలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి ఆలయ తాళాలను పగులగొట్టి లోపల ఉన్న డిబ్బీలోని నగదును దొంగలు అపహరించుకుపోయారు. ప్రతిరోజు మాదిరిగా ఆలయ అర్చకులు శనివారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిబ్బీలో రూ. 50 వేలు వరకు నగదు ఉండొచ్చని, ఏడాదికి ఒకసారి డిబ్బీని తెరుస్తూ ఉంటామని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగుపాడు సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

ఉంగుటూరు,మార్చి 15: కాగుపాడు గ్రామ సర్పంచ్ కడియాల సుదేష్ణకు జిల్లా అధికారులు షోకాజ్ నోటీసు ఇచ్చారు. సర్పంచ్ కడియాల సుదేష్ణ పంచాయతీ పాత భవనం పడగొట్టడంలో పంచాయతీరాజ్ చట్టాలను ఉల్లంఘించారని అదే గ్రామ వార్డు సభ్యుడు వంకిన మాధవరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్ర సర్వోన్నత న్యాయ స్థానంలో వేసిన రిట్ విషయమై అధికారులు స్పందించారు.

రేపు లచ్చిగూడెంలో పోలవరం గ్రామసభ

కుక్కునూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం పునరావాస పరిహారం అందించే క్రమంలో ఈ నెల 17వ తేదీన లచ్చిగూడెం గ్రామంలో గ్రామసభ నిర్వహించనున్నారు. నిర్వాసితుల ఇంటి విలువకు సంబంధించి అవార్డు ప్రక్రియ జరపనున్నారు. ఈ క్రమంలో గ్రామసభ నిర్వహించనున్నారు. లచ్చిగూడెం నిర్వాసితులంతా ఈ అవకాశం వినియోగించుకోవాల్సినదిగా కుక్కునూరు తహసీల్దార్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీనివాసా గోవిందా....



ద్వారకాతిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా గోవిందా.. శ్రీవెంకటేశా గోవిందా.. అంటూ భక్తులు చినవెంకన్నను దర్శించి భక్తితో పూజలు చేసుకున్నారు. శనివారం ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తమ ఇష్టదైవమైన స్వామివారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దాదాపు 20వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. స్వామివారిని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు దేవస్థానం మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

సుదర్శన కల్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



పోలవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత సుదర్శన కల్యాణ వెంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సుమారు రెండువేల మంది భక్తులు ఆలయ దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామశర్మ తెలిపారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు పులిహోర, పరమాన్నాల ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా ముగిసిన తిరుకల్యాణ మహోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని జనార్దన స్వామి ఆలయం వద్ద ఈనెల 9వ తేదీ నుంచి జరుగుతున్న జనార్దనస్వామి, రంగనాయకస్వామివార్ల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం పవళింపు సేవతో ముగిశాయి. తొలుత అమ్మవార్లకు, స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగబాబు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

పోలవరంలో మధ్యాహ్నం తరగతులు

పోలవరం, మార్చి15(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో ఒంటిపూట బడులు శనివారం నుంచి ప్రారంభం కావలసి ఉండగా పూర్తి రోజు తరగతులు కొనసాగాయి. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జూనియర్ కళాశాల ఉండడం, ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి హైస్కూలు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. గూటాల జిల్లా పరిషత్ హైస్కూలులో మధ్యాహ్నం భోజనానంతరం తరగతులు ముగించారు. సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో హైస్కూలు విద్యార్థులకు పరీక్షల అనంతరం తరగతులు నిర్వహించడం జరుగుతుందని హెచ్‌ఎం విజయ రాఘవన్ తెలిపారు.

పది పరీక్షలకు 265 మంది విద్యార్థులు

పోలవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఎంఈవో జె.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండలంలో 244 మంది రెగ్యులర్ విద్యార్థులు, 21 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మంచినీరు, బల్లలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

బుట్టాయగూడెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎస్ఎఎస్ సొసైటీ ఆధ్వర్యంలో 29 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ కిట్స్‌ను అందజేశారు. ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలపై సమీక్ష

ఉంగుటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని 5 పరీక్షా కేంద్రాల పరిధిలో ఉంగుటూరు, బొమ్మిడి, చేబ్రోలు, నారాయణపురం, కైకరం గ్రామాల హైస్కూళ్ళ సెంటర్ల పరిధిలో బీఎన్ఎస్.163 సెక్షన్ విధించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర వర ప్రసాద్ వివరించారు.



నూతన కార్యవర్గ సభ్యులు.. అభినందిస్తున్న నాయకులు

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

ఏలూరు రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏలూరులో శనివారంనాడు జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం ఏలూరుజిల్లా శాఖకు కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడుగా లక్కోజు రాజగోపాలాచారి, రాష్ట్రకార్యదర్శిగా చదరబోయిన శ్రీనివాస్‌యాదవ్, నగర యూత్ అధ్యక్షుడిగా జరాజపు రాఘవ, కార్యదర్శిగా ఎదలాడ నాని, బి వెంకట్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారికి నియామకపత్రాలను అందించారు. రాష్ట్రఅధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీల సమస్యలపై పోరాటం చేస్తున్నామని జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్‌లు కల్పించి బీసీమహిళలకు సబ్‌కోటాఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రబీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ రాష్ట్రఅధ్యక్షుడు ఎస్‌వీఆర్ విఠల్‌కుమార్, ఉక్కునూరి గోపాలకృష్ణ, బాలిన రాంబాబు పాల్గొన్నారు.

పెదవేగి మండల సమావేశానికి వైసీపీ డుమ్మా

పెదవేగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం జరిగింది. ఈ సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీపీతోపాటు ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. దీంతో మండల పరిషత్ ఉపాధ్యక్షుని అధ్యతన సమావేశాన్ని నిర్వహించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించి, అమలుకు అనువుగా తీర్మానాలు చేశారు. పెదవేగి మండలంలో మొత్తం 25 ఎంపీటీసీ స్థానాలకు గాను 18 ఎంపీటీసీ స్థానాలు వైసీపీ కైవసం చేసుకుంది. కాగా శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి వైసీపీ ఎంపీటీసీలు కావాలని రాకుండా ఆగిపోయారని ప్రచారం జరిగింది. ఎంపీపీ తాతా రమ్య, ఒక ఉపాధ్యక్షురాలు మేడికొండ ఉమాదేవితో సహా 15మంది సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. టీడీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడుతుందని భావించారు. కానీ వైసీపీకి చెందిన ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ మరో ఉపాధ్యక్షుడు బొబ్బూరి నాగేశ్వరరావు సమావేశానికి హాజరుకావడంతో ఆయన అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు.

సమస్యలపై వినతులు అందజేత



బుట్టాయగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బూసరాజుపల్లిలోని పోలవరం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో శనివారం ఏపీ ట్రైకార్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు గ్రీవెన్స్ నిర్వహించారు. సీసీ రోడ్లు నిర్మించాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని, పనులను వేగవంతం చేయడంలో పంచాయతీ కార్యదర్శుల జాప్యాన్ని నివారించాలని పలువురు నాయకులు, కార్యకర్తలు చైర్మన్‌కు వినతులను అందజేశారు.







ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ ర్యాలీ.. ద్వారకాతిరుమలలో పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే మద్దిపాటి.. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రతిజ్ఞ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలు

పారిశుధ్య పనుల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పోలవరం/బుట్టాయగూడెం/టి.నరసాపురం/ఉంగుటూరు/లింగపాలెం/చింతలపూడి/పెదవేగి/కామవరపుకోట/భీమడోలు/ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/ కొయ్యలగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో వైద్యాధికారులు నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రి పరిసరాలలో చెత్తాచెదారాన్ని తు డిచి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిం టెండెంట్ రాంబాబు, వైద్యాధికారులు సునీల్, కృష్ణంరాజు, భార్గవ్ పాల్గొన్నారు.

● పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని కెఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. శనివారం బుట్టాయగూడెంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. పరావరణాన్ని కాపాడుకోకపోతే మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు.

● టి.నరసాపురం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన బొరంపాలెం, టీ.నర్సాపురంలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఆర్.ఫణీంద్రబాబు, డాక్టర్ ఆంజనేయులు, కల్పనరాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు మండలంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు మానవ హారాలు నిర్వహించారు. ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, ఇన్‌చార్జి తహశీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య పనులు నిర్వహించారు. నారాయణపురం స్థానిక ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● లింగపాలెం మండలం మఠంగూడెంలో మండల విస్తరణాధికారి జేయం రత్నకుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలు, రోడ్ల వెంట మొక్కలు నాటారు. గ్రామంలో వ్యాపారులకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొదిల ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి షర్మిల తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెబుదామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో సింగిల్ యూజ్ వలన అనర్థాలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.జె.కె.నరేంద్రకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి మండలం దుగ్గిరాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీవో అనురాధ మాట్లాడుతూ ఏలూరును స్వచ్ఛమైన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సర్పంచ్ గుంజా క్రీస్తుమణి మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో కేపీ.చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ షరీఫ్, గ్రామ కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తూ పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్.భ్రమరాంబ, గ్రామ కార్యదర్శి కే.వరప్రసాద్, వీఆర్వో అమర్, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోటలో గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష, పంచాయతీ కార్యదర్శి బి.రవినాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మొక్కలు నాటారు. ఇంటింటికి బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు.

● భీమడోలు మండలంలోని పోలసానపల్లి, గుండుగొలను, భీమడోలు, పూళ్ళ తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలకు ఎంపీడీవో పద్మావతి దేవి హాజరయ్యారు. ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పోలసానపల్లి గ్రామాన్ని ఎంపీడీవో పద్మావతిదేవి దత్తత తీసుకున్న నేపథ్యంలో ఆగ్రామస్తులతో మానవహారం చేపట్టి అవగాహన కల్పించారు. సర్పంచ్ షేక్ అసీనా రహీమాబేగమ్, యువ నటి సుందరి, వార్డు సభ్యులు, పలు పార్టీ నేతలు పాల్గొన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, వైద్యులు సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరురూరల్ మండలం మల్కాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీడీవో వెన్నాశ్రీలత మాట్లాడుతూ ప్రతిమహిళా ముందడుగు వేసి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కూరగాయలకు ప్లాస్టిక్ సంచులను వాడవద్దని జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులను ఉపయోగించాలన్నారు.

● జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యానికి, సమాజ ఆరోగ్యానికి పరిశుభ్రత ఎంతో కీలకమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పలు పోలీస్ స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు.

● జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మునిసిపల్ కమిషనర్ కెవి.రమణ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కమిషనర్ కెవి.రమణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేపీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కౌన్సిలర్ వలవల తాతాజీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ముస్తఫా, బత్తిన చిన్నా పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, కార్యదర్శి కే.సురేష్, టీడీపీ నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, బీజేపీ నాయకురాలు బొల్లిన నిర్మాలకిషోర్, చింతలవెంకటరమణ, జనసేన పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, బీఎస్ఎన్ స్వామి, గొలిశెట్టి వాసు పాల్గొన్నారు. బయ్యన్నగూడెంలో సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, మద్దుతేజ, బాలం నరేష్, పంచాయతీకార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పారిశుధ్య పనులు

ద్వారకాతిరుమల/చింతలపూడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రపరిసరాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెంకట్రాజు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య కార్మికులతో కలసి పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. పంగిడిగూడెం జడ్పీ పాఠశాలలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తెలుగుపండిట్ మద్దాల పెద్దిరాజు ఆధ్వర్యంలో జరిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి ఎప్పుడూ పరిశుభ్రంగానే ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, అధికారులు వేగిలింగేశ్వరస్వామి చెరువు పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం జరిపారు. మునిసిపల్ కమిషనర్ డి.పావని, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర

ఏలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, ప్రజలు వాడొద్దని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. ఆర్ఆర్‌పేటలోని ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మేయర్ షేక్‌నూర్జహాన్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ రిజ్వాయర్ ప్రహరీగోడకు పెయింటింగ్ వేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రజల్లో స్వచ్ఛత-పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని, చిత్తశుద్ధితో అందరూ పాటించాలని కలెక్టర్ వివరించారు. పర్యావరణానికి ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు అంటూ సెయింట్ థెరిస్సా స్కూల్ విద్యార్థినులు ప్లకార్డులు, బ్యానర్లుతో ర్యాలీలో ఆకర్షణగా నిలిచారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానీ, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సెట్వెల్ సీఈవో ప్రభాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర

జిల్లా కలెక్టరేట్ వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వి.శ్రీలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిరాణి నిర్వహించారు. ప్రహరీగోడలకు రంగులు వేశారు.

పీసా చట్టంపై అవగాహన ఉండాలి

బుట్టాయగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై ప్రజాప్రతినిధులు కొత్తగా పీసా చట్టం గ్రామసభకు ఎన్నికైన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల టీడర్లు, సచివాలయం సిబ్బంది మండలస్థాయి అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌సీఆర్‌డీ జేడీ రమణ తెలిపారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం నుంచి బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో డీఎల్‌డీవో రాజు, ఎన్ఐఆర్‌టీ శ్రీను, ఎంపీడీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాటాకు ఇల్లు దగ్ధం

కొయ్యలగూడెం, మార్చి15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన మిద్దే శ్రీను ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ పరామర్శించి ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్లపై గుంతలు పూడ్చాలి

చింతలపూడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతినాటికి గుంతలు లేని రోడ్లు పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం 50 శాతం వరకే పూడ్చారని, మిగిలినవి గుంతలుగానే ఉన్నాయని పట్టణ సీపీఐ కమిటీ విమర్శించింది. చింతలపూడి పట్టణం పరిసర రోడ్లు ఇంకా గుంతలమయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బైపాస్‌రోడ్డు, నాగిరెడ్డిగూడెం రోడ్డు, పలు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని ఆర్‌అండ్‌బి ఏఈకి వినతిపత్రం ఇచ్చారు.

నిర్వాసితుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు



నిర్వాసితులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.కిరణ్‌కుమార్‌రెడ్డి

వేలేరుపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులయ్యే ప్రజలను పట్టించుకోకుండా ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, పోలవరం అధ్యయన కమిటీ ఉపాధ్యక్షులు నారప రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం నాడు యర్రబోరు, సుద్ధగుంపు, చాగరపల్లి, బుర్రతోగు, పాతపోచిరాల గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల అధ్యయన కమిటీ సభ్యులు పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నట్టు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ముంపు గ్రామాల్లో సామాజిక, ఆర్థిక సర్వేలు చేపట్టి నిర్వాసితులను గుర్తించి 98వేల కుటుంబాలకు గుర్తింపు సంఖ్యను కాంగ్రెస్ హయాంలో కేటాయించామని తెలిపారు. వారికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇది ఇలా ఉంటే 2017లో అవార్డు ప్రకటించిన కుటుంబాలకు నేటికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారాలు చెల్లించకుండా నిర్వాసితులను ఇబ్బందులు పెడుతున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి గందరగోళంలో పడిపోయిందని, సర్వేలను తారుమారు చేయడమే కాక పరిహారాల్లో కూడా భారీగా కోతలు విధించిందని దీని కారణంగా నిర్వాసితులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. గత ప్రభుత్వం అవకతవకల వలన 41.15 కాంటూరులో ఉన్న గ్రామాలను 45.75 కాంటూరులోకి మార్చటం వలన వారికి పరిహారాలు రాక వరదలు వస్తే ఇబ్బందులుపడుతున్న పరిస్థితి ఏర్పడటం దారుణమన్నారు.

సారా తయారీ, విక్రయాలు నిలిపివేయాలి



జగన్నాథపురంలో నవోదయం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలను నిలిపివేయాలని భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. ఐఎస్ జగన్నాథ పురం, రాఘవాపురం గ్రామాల్లో సారా నిర్మూలన కోసం ఏర్పాటైన నవోదయం 2.0 పోస్టర్‌ను అధికారులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి: ఎస్పీ



ఎస్పీని సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి దాన్ని పదును పెట్టే బాధ్యత గురువులదేనని జిల్లా ఎస్పీ ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మూడవ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అకడమిక్ సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎస్పీ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. నూతన క్యాంపస్ నిర్మాణ వీడియోలను స్క్రీన్‌పై చూపించారు. అనంతరం ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్‌ను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. పాఠశాల చైర్మన్ మద్దిపాటి చైతన్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్ని చితకబాదిన మారు తండ్రి



ఆస్పత్రిలో బాధితురాలితో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల్ని చితక బాదుతున్న మారు తండ్రి ఉదంతమిది. పట్టణంలో అంకుశం జ్యోత్స్న అనే మహిళతో పట్టణానికి చెందిన పుచ్చకాయల దుర్గాప్రసాద్ ఉంటున్నాడు. అయితే జ్యోత్స్నతో పాటు ఆమె నాలుగవ తరగతి చదువుతున్న సాత్విక్ (11), రెండవ తరగతి చదువుతున్న అతని చెల్లి కరుణా సత్య (8)ను మద్యం తాగి వచ్చిన దుర్గాప్రసాద్ శుక్రవారం హోలీ పండుగ రోజు రాత్రి, శనివారం విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచాడు. దీనితో వీరు స్థాని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత మహిళ జ్యోత్స్న తెలిపిన వివరాలు ప్రకారం.. భర్తకు దూరంగా ఉంటున్న తనను కొంతకాలం క్రితం దుర్గాప్రసాద్ వివాహం చేసుకున్నాడని జ్యోత్స్న తెలిపింది. అయితే తన పిల్లలంటే దుర్గాప్రసాద్‌కు ఇష్టం లేదని కన్నీటి పర్యంతమైంది. రెండు నెలలుగా విపరీతంగా కొడుతున్నాడని ఆమె తెలిపింది. పిల్లల శరీరంపై మానిన గాయాలు కనిపిస్తున్నాయి. ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా ఆసుపత్రిలో పిల్లలను పరామర్శించారు.

ఇంటర్వ్యూ..

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కోటగిరి మురళీకృష్ణ, వ్యవసాయ అధికారి



● **మండలంలో ఎన్ని రైతు సేవా కేంద్రాలున్నాయి?**

19 ఉన్నాయి. వీటిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారు.

● **మండలంలో ఏ పంటలు పండిస్తున్నారు?**

వరి, మొక్కజొన్న, మామిడి, జీడి మామిడి, జామ, ఆయిల్‌పామ్, కూరగా యల పంటలు

● **వ్యవసాయ పనిముట్లకు రాయితీలు ఉన్నాయా?**

వ్యవసాయ పనిముట్లకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. ఈనెలలో తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ పంపులు, ట్రాక్టర్ పనిముట్లు సబ్సిడీపై అందిస్తున్నాం.

● **కూరగాయల పంటలకు ప్రోత్సాహకాలున్నాయా?**

తీగజాతి పంటలైన సొరకాయ, బీర, కాకర, దొండకాయలాంటి పంటలకు పందిరిలు వేసుకునేందుకు ఎకరానికి లక్షరూపాయలు ప్రోత్సాహకంగా అందిస్తున్నాం. బొప్పాయి, మిర్చి పూలతోటలకు మల్చింగ్‌షీట్లు, డ్రిప్ సిస్టంకు 90శాతం సబ్సిడీ అందిస్తున్నాం.

- లింగపాలెం

మహిళలకు సత్కారం

కామవరపుకోట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌సీఎం చర్చిలో శనివారం అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ బి.వి. ప్రసాద్, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, జిల్లా శిశు సంక్షేమశాఖాధికారి డాక్టర్ పి.సరద, గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, మండల తెలుగుదేశం అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, జనసేన మండల అధ్యక్షులు షేక్ వలీ, బీజేపీ మండల అధ్యక్షు లు బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

తూనికాకు బోనస్ బకాయిలు విడుదల చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వనసంరక్షణ సమితులలో పనిచేస్తున్న కూలీలకు తూనికాకుకు సంబంధించిన బోనస్ బకాయిలు, వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం అటవీశాఖాధికారికి ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కూలీలు డబ్బు విడుదలకాకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే

ఏలూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వైఎంహెచ్ఏ హాలు వద్ద ఏలూరు జిల్లా ప్రైవేటు ల్యాబ్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, డాక్టర్ ఎం.ఎల్.వి. ప్రసాద్, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మామిళ్ళపల్లి పార్థసారథి, గుత్తా రవిచంద్రలను యూనియన్ నాయకులు సత్కరించారు. యూనియన్ నాయ కులు ఎం.వి. వరప్రసాద్, ఎ.బాలు మహేంద్రబాలాజి, కె.ఎస్.ఎస్.ఎన్. సతీష్, మధు, సురేశ్ పాల్గొన్నారు.

చేబ్రోలు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉంగుటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు రైల్వే స్టేషన్ వెయిటింగ్ హాలులో శనివారం నాడు 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి మృత దేహాన్ని తరలించారు. మృతుడు తెలుపు రంగుపై చిన్న గీతల ఫుల్ హ్యాండ్ చొక్కాను ధరించాడు. బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తాడేపల్లిగూడెం జి.ఆర్.పి. ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. ఎవరైనా మృతుడి ఆచూకి కోసం 94906 17090, 99480 10061లో సంప్రదించాలన్నారు.

కన్నాపురం రేంజ్ సబ్ డీఎఫ్‌వోను సస్పెండ్ చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుడిపై దాడిచేసిన కన్నాపురం రేంజ్ సబ్ డీఎఫ్‌వోను వెంటనే సస్పెండ్ చేసి అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. శనివారం గుళ్ళపూడిలో మడకం వెంకాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన జ్యోతి సంఘం జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, కూరం సత్యనా రాయణదొర పాల్గొని మాట్లాడారు. మడకం యాకోబుపై సబ్ డీఎఫ్‌వో దాడిచేసి ఐదు రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

అయోధ్యలో ప్రతిష్ఠించే విగ్రహాలకు ప్రత్యేక పూజలు

కైకలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి):సహస్రలింగ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం అయోధ్యలో కైకలూరు వాసులు విశేష పూజలు నిర్వహించారు. కైకలూరు షిర్డిసాయి ధ్యానమందిరం ఆధ్వర్యంలో అయోధ్యలో సహస్ర లింగం, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దుర్గాదేవి, చతుర్థిలింగాలు, నందీశ్వరుడి విగ్రహాలను ధ్యాన మందిర అధ్యక్షుడు కొండేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా అయోధ్యలో ఈ విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి కైకలూరు సరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున అయోధ్య తరలివెళ్లారు.

సెకండ్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ముదినేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో చివరి రోజున జరిగిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 112 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 106మంది హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ పరీక్షలకు డిపార్ట్ మెంట్ అధికారిగా కలిదిండి జూనియర్ కళాశాల లెక్చరర్ సుధాకర్ వ్యవహరించారు.

పుల్లవ డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న నాయకులు

కైకలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా కాలువల అభివృద్ధితోనే ముంపు నివారణ సాధ్యమని డీసీ చైర్మన్ పొత్తూరి వాసు రాజు అన్నారు. శనివారం కైకలూరు మండలం పల్లెవాడలో పుల్లవ డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు పనులను రైతులతో కలిసి పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల డ్రైన్లన్నీ అస్తవ్యస్తంగా మారాయన్నారు.. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో రూ.లక్షలాది రూపాయలను వెచ్చించి కాలువల అభివృద్ధి పనులు ఏర్పాటు చేశామన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కిక్కిసను పూర్తి స్థాయిలో తొలగిస్తున్నామన్నారు. ఉప్పుటేరు నుంచి ఆలపాడు, భుజబలపట్నం ప్రాంత చేపలు, రొయ్యల రైతులకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతానికి ఉప్పునీటి శాతం లేనందున చేపల, రొయ్యల చెరువులకు ఈ నీటిని వినియోగించుకోవచ్చంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను డీసీ వైస్ చైర్మన్ వేటుకూరి పెద్దిరాజు, రైతులు ముదునూరి శ్రీహరివర్మ, బోడావుల శ్రీను, నాగబాబు, గంగుల సత్యనారాయణ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

కైకలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలో వ్యాను బైక్‌ను ఢీకొన్న ఘటనలో తండ్రి,కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన గణేషుల బాలాజీ అతని కుమారుడు పార్థు ద్విచక్ర వాహనంపై ఆకివీడు వెళ్తుండగా మార్గమధ్యలో భుజబలపట్నం జడ్పీ హైస్కూల్ సమీపంలో బొలేరో వ్యాను ఢీకొట్టింది. దీంతో వారిరువురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అందుబాటులో లేకపోవడంతో స్థానికులు వారిని ద్విచక్ర వాహనాలపై కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారికి మెరుగైన చికిత్స కొరకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బైక్ ముందు భాగం దెబ్బతింది. కైకలూరు రూరల్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ



వినాయక స్వామి పూజలు చేస్తున్న భక్తులు

కలిదిండి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి రోడ్డు వద్ద ఉన్న ఆలయంలో వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కోరుకొల్లు డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ, గుడివాడ ఫణి కుమార్, చిట్టూరు మురళీకృష్ణ, కొండేటి రాంబాబు, వర ప్రసాద్‌ల దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 8 వేల మంది భక్తుల అన్నసమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కలిదిండి డీసీ చైర్మన్ భోగేశ్వర రావు, బీజేపీ మండలాధ్యక్షులు అంకాల దుర్గా ప్రసాద్, మాజీ ఎంపీపీ చెన్నంశెట్టి మురళీకృష్ణ, భోగేశ్వర స్వామి, ఆలయ ఈవో శేఖర్, శింగనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది పాములు

కైకలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులకు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని న్యాయవాది మేడిశెట్టి పాములు అన్నారు. శనివారం కైకలూరు వైవీ ఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాములు, శ్రీలత, వినియోగదారుల హక్కులపై దిశానిర్దేశం చేశారు. న్యాయవాదిని అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం నున్న శ్రీనివాసరావు, డి.ఉదయప్రకాశ్, ఆర్.జాలబాబు, నల్లూరి శ్రీనివాసరావు, బట్టు వేదాంతం, పి.రవికుమార్, వై.జ్ఞాన ప్రసూనాంబ, ఎ.కుముద పాల్గొన్నారు.



మరమ్మతుల తరువాత పోలవరం లక్ష్మీసాగారం చెరువు

తమ్మిలేరు చెరువులకు మహర్దశ

▸▸ జైకా నిధులతో మరమ్మతులు పూర్తి

చాట్రాయి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామ పరిధిలోని తమ్మిలేరు ప్రాజెక్టు ఆయకట్టు చెరువులు లక్ష్మీసాగారం, నల్లకుంట, చల్లగుళ్ళవారి చెరువు, గండి చెరువు జైకా నిధులతో మరమ్మతులు చేయడంతో వీటికి మహర్దశ వచ్చింది. సుదీర్ఘకాలం మరమ్మతులు లేక సదరు చెరువుల కట్టలు శిథిలమై అధ్వానంగా తయారుకాగా ప్రస్తుతం కొత్త కళ వచ్చింది. ఆరేళ్ల క్రితం టీడీపీ హయాంలో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మత్తులకు రూ.16 కోట్లు జపాన్ బ్యాంకు (జైకా) నిధులు మంజూరైన విషయం విధితమే. వైసీపీ ఐదేళ్ల పాలనలో అరకొర పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు పునఃప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయి. రైతులు హర్షం వ్యక్త చేస్తున్నారు.

కేంద్ర మంత్రి వర్మకు బీజేపీ నాయకుల పరామర్శ



కేంద్రమంత్రిని పరామర్శిస్తున్న నూజివీడు బీజేపీ నాయకులు

నూజివీడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మను భీమవరంలోని ఆయన స్వగృహంలో శనివారం నూజివీడు బీజేపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కారు ప్రమాదంలో ఆయన గాయపడిన విషయం విధితమే. నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి మంత్రికి ఆంజనేయస్వామికి పూజ చేసిన సింధూరాన్ని అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు ఎం.రాజశేఖర్, జీఆర్‌కే రంగారావు, మాటూరి రవికాంత్, శివరాజ్, వసుంధరా దేవి, మాగంటి వాసు, రాజేంద్రప్రసాద్, మల్లికార్జున, జగదీష్ తదితరులు పరామర్శించారు.

సారా తయారీ.. అమ్మకాలు వద్దు



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి ఆవులయ్య

చాట్రాయి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేయడం.. అమ్మకాలు చేయడం చట్టం దృష్టిలో నేరస్తులుగా మిగిలిపోవద్దని, చట్టబద్ధమైన వృత్తులు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతకాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆవులయ్య హితవు పలికారు.
సారా రహిత ఏపీ కోసం ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం పోతనపల్లిలో సారా అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాజాతా బృందం సారా అనర్థాలపై ప్రజలకు పాటలు నాటికలు ద్వారా వివరించారు. నాటు సారా నిర్మూలనకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అజయ్‌కుమార్ సింగ్, పాండు రంగారావు, ఎస్ఐ రామకృష్ణ, గ్రామ పెద్దలు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు



చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో పరీక్ష పేపర్లు భద్రపరుస్తున్న అధికారులు

ముదినేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ముదినేపల్లి మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 17వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు ఎనిమిది జడ్పీ హైస్కూళ్లకు చెందిన 408 మంది విద్యార్థులు, ఏడు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 255 మంది మొత్తం 663 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 348 మంది బాలురు, 315 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు పెదగొన్నూరు, ముదినేపల్లి జడ్పీ హైస్కూళ్లు, ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సహాయ మాత ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తెలుగు మీడియంలో ఐదు శాతం విద్యార్థులే..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి కేవలం ఐదు శాతం మంది విద్యార్థులు మాత్రమే తెలుగు మీడియంలో పదవ తరగతి పరీక్షలను రాయనున్నారు. ఎనిమిది జడ్పీ హైస్కూళ్ల నుంచి 408 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు హాజరవుతుండగా, కేవలం 19 మంది విద్యార్థులు తెలుగు మీడియం పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంగ్లీష్ మీడియంలో 389 మంది విద్యార్థులు అంటే 95 శాతం మంది పరీక్షలు రాయనున్నారు. మండలంలోని పెదపాలపర్రు జడ్పీ హైస్కూలు నుంచి 11 మంది, అల్లూరు హైస్కూలు నుంచి 8 మంది విద్యార్థులు తెలుగు మీడియంలో టెన్త్ పరీక్షలు రాయనుండగా, ముదినేపల్లి, చిగురుకోట, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, గురజ, వడాలి హైస్కూళ్ల నుంచి నూరుశాతం విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాయనున్నారు.మండలంలో తెలుగు మీడియంలో పరీక్షలు రాసే విద్యార్థుల శాతం గత ఏడాది కంటే 39 శాతం తగ్గింది. 2023 -24 సంవత్సరంలో మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి 426 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 237 మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో, 189 మంది తెలుగు మీడియంలో పరీక్షలు రాశారు. ఈ ఏడాది ఆ సంఖ్య 19కి పడిపోయింది.

విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ అందజేత

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ కోరారు. ముదినేపల్లి మండలం చిగురుకోట జడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు శనివారం పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. ప్రభుత్వం విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, ఎస్ఎంసీ చైర్మన్ పేరం స్వామి, హెచ్ఎం ఆర్.శ్రీధర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు తుమ్మా వీరాంజనేయులు, పార్టీ నాయకులు చొప్పరపు ఫణి పాల్గొన్నారు.

కైకలూరు మండలం నుంచి 1044 మంది..

కైకలూరు : టెన్త్ పరీక్షలకు కైకలూరు మండలంలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో డి.రామారావు తెలిపారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య, భాష్యం హైస్కూల్, హోలీక్రాస్, జడ్పీ బాలికల హైస్కూల్, మండలంలోని భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 1044 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని కొల్లేటికోట, ఆలపాడు జడ్పీ హైస్కూల్లోని విద్యార్థులు భుజబలపట్నం పరీక్షా కేంద్రాల్లో, దొడ్డిపట్ల హైస్కూల్ విద్యార్థులు కలిదిండి మండలం ఆరుతెగలపాడు హైస్కూల్లో, తామరకొల్లు హైస్కూల్ విద్యార్థులు, కలిదిండి మండలం కోరుకొల్లు జడ్పీ హైస్కూల్లో పరీక్షలు రాస్తారని తెలిపారు. విద్యార్థులుంతా ఉదయం 9గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా సమయం ఉంటుందన్నారు.



టెన్త్ పరీక్ష మెటీరియల్స్ అందజేస్తున్న డైరెక్టర్ వినోద్

చాట్రాయి మండలం నుంచి 454 మంది...

చాట్రాయి : టెన్త్ పరీక్షలకు చాట్రాయిలోని జడ్పీ హైస్కూల్, ఆర్సీఎం పాఠశాల పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. మండలంలో ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 454మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వీరిలో 22 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని అన్నారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 250 మంది, ఆర్సీఎం పాఠశాల పరీక్షా కేంద్రంలో 177 మంది పరీక్షలు రాయనున్నారని, పరీక్ష పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చామని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ ఉత్వర్వులు జారీ చేశారని ఎంఈవో తెలిపారు.

ముసునూరు మండలం నుంచి 600 మంది

ముసునూరు : టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌లు తెలిపారు. శనివారం ముసునూరు, చెక్కపల్లి, గోపవరం జడ్పీపాఠశాలల్లో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను ఎంఈవో బి.వి.ఎస్ సుబ్బారావుతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మూడు పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, విద్యుత్, ఫ్యాన్‌లు, టాయిలెట్లు, మెడికల్ క్యాంపులు తదితర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సోమవారం నుంచి టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎంఈవో మాట్లాడుతూ చెక్కపల్లి పాఠశాల నుంచి 284 మంది, ముసునూరు నుంచి 195మంది, గోపవరం నుంచి 121మంది విద్యార్థులు కలిపి మొత్తం 600మంది టెన్త్ పరీక్షలు రాయినున్నట్టు తెలిపారు.



వెంకటాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కార్మికులు

స్వచ్ఛాంధ్రపై అవగాహన

కలిదిండి/ముదినేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి పంకజ్ కుమార్ అన్నారు. శనివారం కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో అధికారులు, కూటమి నాయకులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలిదిండిలో సర్పంచ్ మారుతి ప్రసన్న, వెంకటాపురంలో సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, ముదినేపల్లి పంచాయతీ పరిధిలో ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఈవోపీఆర్డీ అశోక్, పంచాయతీ కార్య దర్శి రమేష్, సచివాలయం-2 కార్యదర్శి సునీత వస్త్రంతో చేసిన సంచులు అందజేశారు.శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వర రావు, పెదపాలపర్రులో సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గంటా రాకేష్, గన్నమనేని వెంకటేశ్వరరావు, పెదగొన్నూరు, వడాలి గ్రామాల్లో సర్పంచ్‌లు తాడంకి శిరీష, మరీదు దుర్గాశ్రీ ర్యాలీలు నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చాట్రాయి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. చాట్రాయిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలకు మొదటిసారి ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. గతంలో మండల పరిధిలోని విద్యార్థులు 15 కిలోమీటర్లు దూరంలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట వెళ్లా పరీక్షలు రాసేవారు. ఇక్కడ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్త చేస్తున్నారు. శనివారం ఇంటర్ సెకండ్ ఇయర్ కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలు జరిగాయి. మొత్తం 89 మంది విద్యార్థులకుగాను మొత్తం హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.



ఉద్యోగం పొందిన వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు

నూజివీడు టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జంగంగూడెం ఐటీఐ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 26 మందికి పలు కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. జాబ్‌మేళాలో వీల్స్ ఇండియా, వరుణ్ మోటార్స్ మొదలైన కంపెనీలు పాల్గొనగా 41 మంది నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. అనంతరం 26 మంది పలు కంపెనీలకు ఎంపికైనట్టు ప్రకటించారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.ప్రవీణ్, కో-ఆర్డినేటర్ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సామాజిక న్యాయానికి సీఎం చంద్రబాబు ప్రతీక



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ముదినేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి):తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని, ఆయన ఆలోచనలు, ఆదర్శాలు దేశానికే దిక్సూచి అయ్యాయని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు ఎమ్మెల్యేగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి 47 సంవత్సరాలు, సీఎంగా 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం ముదినేపల్లిలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధికి సంక్షేమానికి చంద్రబాబు సమ ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రిగా తన హయాంలో చంద్రబాబు పలు చారిత్రాత్మక విజయాలు సాధించారన్నారు. రాజకీయ రంగంలో సామాజిక న్యాయం పాటించటంలో, మహిళా సాధికారిత, బీసీ వర్గాల ఉన్నతి, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో చంద్రబాబుకు ఎవ్వరూ సాటిరారన్నారు. పార్టీ నాయకులు పుట్టి లక్ష్మణ స్వామి, దండుబోయిన నాని, ఈడే కృష్ణ పాల్గొన్నారు.



కైకలూరులో అధికారులు, పారిశుధ్య కార్మికుల ర్యాలీ దృశ్యం

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం



బలివేలో స్టిక్కర్లను అందజేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్, తదితరులు

కైకలూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. శనివారం కైకలూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి హైవే వెంబడి మాగంటి సెంటర్ వరకు ప్లకార్డులతో ప్రదర్శన చేసి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి, రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ పట్టణపార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ, జనసేన నాయకుడు మైగాపుల రామాంజనేయులు, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి ఆనంద భూషణం, తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు/చాట్రాయి : ముసునూరు మండలం ముసునూరు, కొర్లగుంట గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేల్పుచర్ల, బలివే, యల్లాపురం గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో జి.రాణి ఆధ్వర్యంలో సచివాలయాల్లో గ్రామసభ నిర్వహించి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెత్త సేకరణ తదితర వాటిపై తహసీల్దార్, ఎంపీడీవోలు సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ఈవోపీఆర్డీ బీపీ సత్యనారయణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం చాట్రాయిలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కాగితం, గుడ్డ సంచులు వాడదాం అంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, మహిళలు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర ర్యాలీలు జరిగాయి.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

▸▸ ఎక్సైజ్ సీఐ మస్తానయ్య



మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ

నూజివీడు టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ కాపాడుదామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య కోరారు. నూజివీడు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీఐ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజుల సందర్భంగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా మన నివాస ప్రాంతాలు పచ్చని వనాలుగా మారి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించటంతో పాటు ఆహ్లాదకమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల పరిశీలన

ముదినేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను నిర్వహించడంలో శ్రద్ధతో వహించాలని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ తెలిపారు. ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. గ్రంథాలయ రికార్డులను, పాఠకుల అభిప్రాయాలను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అన్ని శాఖా గ్రంథాలయాలకు సరిపడినన్ని పుస్తకాలను సరఫరా చేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. ముదినేపల్లి గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పుస్తకాల ప్రదర్శన రికార్డులను పరిశీలించి ఆయన గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవిని అభినందించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను అమలు చేయడంలో కూడా ముదినేపల్లి గ్రంథాలయం సంతృప్తికరంగానే పనిచేస్తుందన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో తదితరులు

ఏపీఆర్జేసీ డీసీ సెట్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ముసునూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్ఎస్ క్యాట్ ఏపీఆర్జేసీ డీసీ సెట్ పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ చేతులు మీదుగా శనివారం ఆవిష్కరించామని ముసునూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కో-ఆర్డినేటర్ కె.ప్రవీణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసునూరు పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి 80 సీట్లు ఉన్నాయని, దరఖాస్తులు ఈనెల 31 వరకు సమయం ఉందన్నారు. ఏప్రిల్ 25న రాత పరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



బొమ్మినంపాడు సచివాలయానికి వాటర్ కూలర్‌ను అందించిన శ్రీను

వాటర్ కూలర్ వితరణ

ముదినేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మినంపాడు గ్రామ సచివాలయ కార్యాలయానికి ఆ గ్రామానికి చెందిన దాసరి శ్రీను రూ.15 వేలు విలువైన వాటర్ కూలర్‌ను బహూకరించారు. సచివాలయ సిబ్బందికి తాగునీటి సౌకర్యం కోసం శనివారం ఆయన కూలర్ ఏర్పాటు చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు కేనం ప్రసాద్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, జనసేన నాయకుడు బాసినశెట్టి కిషోర్ పాల్గొన్నారు.